




యంత్రాలతో శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పూడికతీత.. కొందరికి మేత



- రూ.లక్షల్లో ఖర్చు పెట్టినా ఫలితం శూన్యం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ ఉన్నతాధికారులు
- ఏటా రూ.3.6 కోట్ల వరకు ఖర్చు
- కాలువల్లో వ్యర్థాలకు రూ. 5.5 కోట్లు ఖర్చు

నంద్యాల టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీల్లో పూడికతీత పనులు చాలా మంది జేబులు నింపుతున్నాయి. అందువల్ల ప్రతి ఏడాది ఈ పనులకు రూ. లక్షల్లో ఖర్చువుతున్నట్లు లెక్కలు కనిపించడమేగాని ఫలితం ఉండటం లేదు. మున్సిపాలిటీ అధికారులు పూడికతీత పనులు పూర్తయ్యాయని నివేదికలు పంపిస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఏమీ మారడం లేదు. కాలువల్లో మురుగు నీటి నిల్వలు, చెత్త కుప్పలు, దుర్వాసన, దోమల వంటి సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పూడికతీత పనులయ్యాయనే పేరుతో పెద్ద మొత్తంలో నిధుల వినియోగం కావడమేగాని పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడటం లేదు.

ఈ ఏడాది భారీ వర్షాలుపడి పట్టణం ముంపునకు గురైంది. మురుగు కాల్వల్లో పూడికతీత పేరు చెప్పి కొంతమంది బతికేస్తున్నారంటే నమ్మక తప్పదు. వీరిలో కొందరు అధికారులు. మరికొంతమంది గుత్తేదారులు ఉన్నారు. ఏటా వారికిదే మేత. కష్టనష్టాలు ప్రజలవి.. వాన పడితే చాలు పొంగి పొర్లుతున్న డ్రైనేజీ పనులు వీరి జేబులు నింపుతున్నాయి.

నంద్యాల పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. 2.4 లక్షలు మంది జనాభా నివసిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఏటా పట్టణంలో ప్రధానంగా చామకాల్వ అనుకుని ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ముంపునకు గురవుతోంది. అలాగే సలీంనగర్, సుందరయ్య నగర్, సాయిబాబా నగర్, ఎన్జీవో కాలనీ వంటి ప్రాంతాల్లో నీరు వచ్చి ముంచెత్తుతోంది. నంద్యాల మున్సిపాలిటీలో కంపాస్టర్లు, 5. పెద్ద కంపాస్టర్లు 2, టిప్పర్లు 3, జేసీబీ1, మినీ ఎక్సకవేటర్లు 2 ఉన్నాయి.

- నంద్యాల పట్టణంలో ప్రతి నెల పూడికతీతకు చేస్తున్న ఖర్చు.. రూ.30లక్షలు
- ఈ ఏడాది చేపట్టిన పనుల విలువ సుమారుగా రూ.3.6 కోట్లు
- ఐదేళ్ల కాలంలో కేవలం డ్రైయిన్లలోని వ్యర్థాలను తొలగింపునకు చేసిన వ్యయం సుమారుగా రూ 5.5 కోట్లు.

ఈ డబ్బంతా ఎక్కడికి పోతోంది?

ఎవరి జేబులు నిండుతున్నాయి..?

వర్షకాలం మొదట్లో పూడికతీత పేరుతో అధికారులు, గుత్తేదారులు పండుగ చేసుకుంటున్నారు. కాల్వలు శుభ్రం చేయకుండానే ప్రతి నెల రూ.30 లక్షలు మింగేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవే కాకుండా ఇటీవల కూటమి ప్రభుత్వం నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.5కోట్లు కేటాయించారు. అయినా ఎక్కడా పని తీరు మెరుగుపడడం లేదు. టెండర్లు వేసిన సమయంలో మాత్రం ఆఘమేఘాలపై పనులు ప్రారంభించి పూడిక తీయకుండానే లెక్కలు చూపించినట్లు ఉన్నతాధికారుల తనిఖీల్లో బయటపడింది.

ఒప్పంద కార్మికులు 343, రెగ్యులర్ ఉద్యోగులు 96 మంది పని చేస్తున్నారు. చామ కాల్వలకు రక్షణ గోడ లేవు. చాలా చోట్ల ఆక్రమణకు గురై వ్యర్థాలతో పూడిపోయింది. మురుగంతా ఇళ్లల్లోకి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం



డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. కాల్వలు శుభ్రంగా ఉంచుతున్నాం. నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేస్తున్నాం. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- గురప్పయాదవ్, ఎంఈ, నంద్యాల


ఆత్మకూరు పట్టణంలో పుష్పాలంకరణలో సాయిబాబా

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



నంద్యాల కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం గురు దత్తజయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయుడి స్వరూపంగా షిరిడీ సాయి బాబాను భక్తులు పూజించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సాయిబాబా దేవాలయాలు, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని నాగులకుంటరోడ్డులో వెలసిన సాయి బాబా గుడి లోని గురుదత్తాత్రేయస్వామికి గురువారం ఉదయం మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, పుణ్య హోమం కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మల సత్రం సాయిబాబా మందిరంలో దత్తాత్రేయుడికి అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.


దత్తాత్రేయ స్వామి



నేడు పీటీఎం : ఏర్పాట్లు పూర్తి

నంద్యాల/ కొలిమిగుండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు నూతన సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగానే పేరెంట్, టీచర్ మీట్ (పీటీఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లాకు గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలల ప్రాంగణాలను వేదికగా మార్చారు. ఈ సమావేశాల్లో విద్యార్థులే తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించేలా కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏర్పాట్ల నిర్వహణకు గాను నంద్యాల జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించింది. పాఠశాలలో ఎన్‌రోల్ దామాషా పద్ధతిన ఏర్పాట్ల నిర్వహణకు నిధులను కేటాయించారు. 30మంది లోపు విద్యార్థులున్న పాఠశాలకు రూ.900, 31 నుంచి 100లోపు ఉంటే రూ.2,250, 101నుంచి 250మంది విద్యార్థులుంటే రూ.5,375, 251నుంచి 1000మంది విద్యార్థులుంటే రూ.6,750, వెయ్యికి పైగా విద్యార్థులున్న పాఠశాలలకు రూ.9వేల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, యజమాన్య పాఠశాలలు, మొత్తం 1,959 పాఠశాలలు, 96 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం 12:30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా తల్లిదండ్రులు, వీఐపీలు, అధికారులతో కలసి విద్యార్థులు సహపంక్తి భోజనం చేస్తారు.

భూ సేకరణకు నిధులు ఇవ్వండి..!
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు తక్షణమే చేపట్టాలి 7

సమస్యల పరిష్కారానికి సానుకూలత

దేవుడి వరం ఘంటసాల 6

అసంబద్ధ విభజన

- రెండు మండలాలుగా ఆదోని.. కొత్తగా పెద్దహరివాణం
- ఆదోనిలోనే ఉంచాలంటూ ప్రజాందోళన
- ఆదోని జిల్లా కోసం కొనసాగుతున్న ఉద్యమాలు


పెద్దతుంబళంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పరిధిలో 40 పంచాయతీలు, 48 గ్రామాలు ఉన్నాయి. మండల మొత్తం జనాభా 2.15 లక్షలు. జిల్లాలోనే అతిపెద్ద మండలం ఇది. గతంలో ఆదోని మున్సిపాలిటీ, ఆదోని, కౌతాళం మండలాలు కలిసి ఆదోని అసెంబ్లీ నియోజవర్గంగా ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కారణంగా కౌతాళం మండలాన్ని మంత్రాలయం నియోజకవర్గంలో కలిపారు. ఆదోని అర్బన్, రూరల్ మండలం కలిపి నియోజకవర్గంగా ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండలాల వారిగి వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయింపులు చేస్తే ఆదోని నియోజకవర్గానికి తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. దీంతో అతి పెద్ద మండలమైన ఆదోని మండలాన్ని ఆదోని అర్బన్, ఆదోని రూరల్, పెద్దహరివాణం, పెద్దతుంబళం మండలాలుగా విభజించాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. మంత్రివర్గ ఉప సంఘానికి వినతి పత్రాలు కూడా ఇచ్చారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మంత్రివర్గ ఉప సంఘం ఆదోనిని రెండు మండలాలుగా విభజించి పెద్దహరివాణం కేంద్రంగా 17 గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటు చేసేలా సీఎం చంద్రబాబుకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నిరసనలు వెల్లువెత్తాయి.

ఆదోని మండలం నైసర్గిక స్వరూపం పరిశీలిస్తే.. ఆదోని కేంద్రం నుంచి తూర్పు వైపున ఆదోని-కర్నూలు వయా ఎమ్మిగనూరు, ఆదోని-గుత్తి వయా పత్తికొండ ప్రధాన రోడ్లు, పడమర వైపున ఆదోని-సిరుగుప్ప వయా పెద్దహరివాణం ప్రధాన రోడ్డు, ఉత్తరం వైపున ఆదోని-రాయచూరు వయా పెద్దతుంబళం ప్రధాన రోడ్డు, దక్షిణం వైపున ఆదోని-బళ్లారి వయా ఆలూరు ప్రధాన రహదారులు ఉన్నాయి.

మిగతా 6వ పేజీలో

ఇదో రకం వడ్డింపు..!

- డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వక ముందే వడ్డీ చెల్లించాలని బ్యాంకు నుంచి నోటీసులు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు
- నేటికీ అసంపూర్తిగా టిడ్కో గృహాలు
- నంద్యాలలో 10 వేల ఇళ్లల్లో 1,077 డబుల్ బెడ్ రూంలు
- లబ్ధిదారుల పేరు మీద బ్యాంకు నుంచి ప్రభుత్వానికి రుణం

నంద్యాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం టిడ్కో గృహాలు నిర్మించి ఇస్తానని చెప్పింది. ఇల్లు అతిగతీ లేదు గాని బ్యాంకు నుంచి అప్పు చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. ఇదీ ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్వాకం. ఇళ్లు నిర్మించినా తాళాలు ఇవ్వలేదు. బ్యాంకు నుంచి అప్పు చెల్లించాలని ఒత్తిడి పెరుగుతోంది. ఇల్లు ఎప్పుడు స్వాధీనం చేసేదీ అధికారులకు ఇప్పటికీ స్పష్టత లేదు. నంద్యాల పట్టణంలో అయ్యలూరు, ఎస్ఆర్‌బీసీ, వైఎస్ నగర్ శివారుల్లో సుమారుగా 10 వేలు టిడ్కో ఇళ్లు నిర్మించారు. వాటిలో 1077 డబుల్ బెడ్ రూంలు నిర్మించారు. అవి నేటికీ అసంపూర్తిగా ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిలో సింగిల్ బెడ్‌రూం ఇళ్లు ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుంది. కానీ డబుల్ బెడ్ రూం కావాలంటే లబ్ధిదారులు రూ.50 వేలు చెల్లించి మిగిలిన రూ.3.6 లక్షలు బ్యాంకు ద్వారా వారే రుణం ఇప్పించి ఆ మొత్తాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది. తర్వాత లబ్ధిదారులు ఆ మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించాలి. దీని ప్రకారం లబ్ధిదారుల పేరు మీద ప్రభుత్వం రుణం తీసుకుంది. నేటికీ ఇల్లు స్వాధీనం చేయలేదు. బ్యాంకు నుంచి అప్పు కంతులు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారు.

ఆలస్యానికి కారణాలు..

ఈ గృహాలు కొన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకోవచ్చు అని చెప్పి కాంట్రాక్టర్లకు రుణాలు మంజూరు చేయించి లబ్ధిదారులను నట్టేటా ముంచింది. నేటికి వారికి ఇళ్లు అందుబాటులోకి రాలేదు. దీనికి తోడు బ్యాంకు నోటీసులు. సింగిల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించలేదు. పాఠశాల, మంచినీటి సౌకర్యం లేదు. పరిసరాలు సరిగా లేకపోవడంతో పాములు తిరుగుతున్నాయి. దొంగల బెడద కూడా ఉంది. ప్రభుత్వం ఇళ్లు ఇస్తే పట్టణంలో అద్దెలు కట్టేపని తప్పుతుందని లబ్ధిదారులు ఆశించారు. కానీ ఎన్నిసార్లు అడిగిన అధికారులు మాత్రం ఇంటి గురించి నేటికీ సరియైన సమాధానం ఇవ్వడం లేదు.

త్వరలోనే నిర్మించి ఇస్తాం



త్వరలోనే అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందిస్తాం. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆలస్యం జరిగింది. ఇదే పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. అన్ని వసతులు కల్పించి త్వరలోనే అందిస్తాం. అన్నింటినీ పర్యవేక్షిస్తున్నాం.

- బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

వడ్డీ చెల్లించాలని బ్యాంకు నుంచి ఫోన్లు



గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం కావాలని తీసుకున్నాం. అయితే మున్సిపల్ అధికారులు కేటాయించామని చెప్పి మా పేరు మీద రుణం తీసుకున్నారు. ఏళ్లు గడుస్తున్న నేటికీ ఇల్లు ఇవ్వలేదు. కానీ బ్యాంకు నుంచి అప్పుకు వడ్డీ కట్టాలని ఫోన్లు వస్తున్నాయి. అధికారులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- విజయలక్ష్మి, లబ్ధిదారు, జగజ్జననీ నగర్, నంద్యాల


అసంపూర్తిగా టిడ్కో ఇళ్లు

అందరి సహకారంతోనే అభివృద్ధి

- కొందరు అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- డోన్ డీడీవో కార్యాలయం ప్రారంభం

డోన్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారం ఉంటేనే గ్రామాల్లో అభివృద్ధి వేగంగా సాగుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేలా అధికారులు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను రాష్ట్ర ఉపముఖ్యంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. అందులో భాగంగానే డోన్ పట్టణంలోని డీడీవో కార్యాలయాన్ని మంత్రి బీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి అధికారి కష్టపడి పని చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్ల నిధులు కూడా తిరిగి వెనక్కు వెళ్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఆర్డీవో కేపీ నరసింహులు, డీఎస్పీ శ్రీనివాసులు, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్ రెడ్డి, సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ డోన్ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.


డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మెరుగైన వైద్యం చేయండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ
- ఇద్దరు వైద్యులకు, ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి షోకాజ్ నోటీసులు

డోన్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం నంద్యాల జిల్లా డీఎంహెచ్‌వో డోన్ రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అలాగే మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ఆ సమయంలో డోన్‌లో విధుల్లో లేని ఒక అధికారికి, చిన్నమల్కాపురంలో ఇద్దరికి అక్కడికక్కడే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వివరణ ఇచ్చుకోవాలని ఆదేశించారు. గుత్తిరోడ్డులో ఉన్న వంద పడకల ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించినా, పని వేళలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పల్స్‌పోలియోపై శిక్షణ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21నుంచి 23వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే పల్స్‌పోలియోపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఉద్యోగులకు గురువారం శిక్షణ కల్పించారు. నంద్యాల జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు, ఐసీడీఎస్, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు మాట్లాడుతూ 3 రోజులపాటు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. డిసెంబరు 21న బూత్‌డే కార్యక్రమం, 22, 23తేదీల్లో ప్రతి ఇంటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు వ్యాక్సిన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.శారదాబాయి, ఆర్బీఎస్‌కే నోడల్ అధికారి ఎస్.కాంతారావునాయక్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి కె.జగదీశ్‌చంద్రారెడ్డి, ఎన్‌సీహెచ్ నోడల్ అధికారి ప్రసన్నలక్ష్మి, ప్రోగ్రాం అధికారి ఎస్ఎన్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఇక బుక్‌లెట్

- విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి
- సమ్మెటివ్ పరీక్షల్లో అమలు



చాగలమర్రి బాలికల పాఠశాలలో సమ్మెటివ్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షలు రాసేందుకు బుక్‌లెట్ అందిస్తున్నారు. విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి పలికారు. సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు కలిపి వేర్వేరు బుక్‌లెట్లను అందించి పరీక్షలు రాయిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని బట్టి ఉపాధ్యాయులు అవగాహన చేసుకునే వీలు ఏర్పడుతుంది. పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంలో వస్తున్న సంస్కరణలో భాగంగా ఇప్పటికే పాఠ్యపుస్తకాలను సమూలంగా మార్పుచేశారు. సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యాసంవత్సరంలో ఫార్మటివ్ అసెస్‌మెంట్ (యూనిట్) పరీక్షలు 4 జరుగుతాయి. క్వార్టర్లీ, హాఫియర్లీ, ఫైనల్ ఎగ్జామ్ స్థానంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ 1, 2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్త విధానంలో మొదటి, రెండోవ సెమిస్టర్లలో రెండు ఫార్మటివ్, ఒక సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు వంతున జరుగుతాయి. ఇప్పటికే రెండు ఫార్మటివ్ పరీక్షలు ముగియగా ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి.



విద్యార్థులకు పంపిణీ చేసిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లు

జిల్లా వ్యాప్తంగా 1.34 లక్షల..

నంద్యాల జిల్లా పరిధిలో 1 నుంచి 5 ప్రాథమిక పాఠశాలలు 996 ఉండగా 45,558 మంది విద్యార్థులు, 21 యూపీ పాఠశాలలో 1,275 మంది విద్యార్థులు, 6 నుంచి 10వ తరగతి వరకు 86,492 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 5,577 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి 1.34 లక్షల అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ బుక్‌లెట్‌లలోనే పరీక్షల నిర్వహణ జరుగుతోంది.

అందంగా తీర్చిదిద్దారు

ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై పరీక్షలు రాసేలా నిర్ణయించిన ప్రభుత్వం, నిపుణుల సలహాలతో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను రూపొందించారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి వారు చదువుతున్న తరగతులకు అనుగుణంగా ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ తయారు చేశారు.



విద్యాప్రమాణాలు పెంచేందుకే..

పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచేందుకే అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు సబ్జెక్టుల వారీగా ఒకే బుక్‌లెట్‌లు పంపిణీ చేసింది.

● జీవయ్య, హెచ్‌ఎం, చాగలమర్రి

విద్యార్థుల ప్రగతికి దిక్సూచి



ప్రభుత్వం చేపట్టిన అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు విద్యార్థుల ప్రగతికి దిక్సూచి. పరీక్షలు రాసే విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థులపై ఒత్తిడిలేని రీతిలో పరీక్షలు పేప ర్లపై కాకుండా ఆకర్షిణీయంగా ఉన్న పుస్తకాలపై రాసేలా ప్రభుత్వం నిర్ణయించింది.

● న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



పరిశీలిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం

దేవుడి వరం ఘంటసాల

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- అలరించిన 'ఘంటసాల స్వరార్చన'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి దేవుడు ఇచ్చిన వరం దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఘంటసాల వంటి గాయకులు తెలుగు పాటకు ఎంతో ఖ్యాతి సాధించి పెట్టారని గుర్తు చేశారు. సభాధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఘంటసాల 100వ జయంతిని టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించామని, నేడు ఆయన 103వ జయంతి సందర్భంగా మిత్ర వంటి గాయకులు కళాక్షేత్రానికి విచ్చేయడం ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారాం, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు, కార్యక్రమ కన్వీనర్ ఇనయతుల్లా, ఉపాధ్యక్షుడు గజల్ మహమ్మద్ మియా, కోశాధికారి కె. రామస్వామి, సీవీ రెడ్డి, కళాకారులు పి.రాజారత్నం, కేవీ రమణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు మిత్రను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, జి. పుల్లయ్య, పత్తి ఓబులయ్య తదితరులు

అలరించిన 'ఘంటసాల స్వరార్చన'

ప్రముఖ సినీ గాయకుడు, అభినవ ఘంటసాల బిరుదు పొందిన హైదరాబాదుకు చెందిన గాయకుడు డీఏ మిత్ర, గాయని అఖిల బృందం ఆలపించిన అలనాటి ఘంటసాల పాటలు ప్రేక్షకులను ఆద్యంతం అలరింపజేశాయి. డీఏ మిత్ర బృందాన్ని టీజీ వెంకటేశ్ శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఏపీఐఐసీకి 4.96 ఎకరాలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నంద్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలోని రూ.26.04 లక్షలు విలువ చేసే 4.96 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీఐఐసీకి అప్పగిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల నవంబరు 28న సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినేట్ సమావేశంలో సదరు అంశంపై ఆమోదం పొందిన విషయం తెలిసిందే. సర్వే నెంబరు 691లో 3.21 ఎకరాలు, సర్వే నెంబరు 692లో 1.75 ఎకరాలు మొత్తంగా కలిపి 4.96 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ భూమిని క్రషింగ్ అండ్ పల్వరైజింగ్ యూనిట్ ఏర్పాటు కోసం త్వరలో ఏపీఐఐసీ ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనుంది.

వీధుల్లో కుక్కలపై నిషేధాస్త్రం

- సంరక్షణ బాధ్యత స్థానిక సంస్థలదే
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- భవన సముదాయాలకు ఫెన్సింగ్ తప్పనిసరి
- 8 వారాల్లో చర్యలు పూర్తి చేయాలని ఆదేశం





కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు బెడద తీవ్రమైన నేపథ్యంలో పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో అవి కనిపించకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పబ్లిక్ స్పోర్ట్స్ కాంప్లెక్సు, బస్టాండులు, డిపోలు, రైల్వే స్టేషన్లలో ఉన్న కుక్కలను వెంటనే తొలగించాలని సుప్రీంకోర్టు సంచనల తీర్పు వెలువరించింది. వీధి కుక్కలను పట్టుకున్న తరువాత వాటికి స్టెరిలైజ్, వ్యాక్సినేట్ ఇచ్చిన తరువాత ఇక వాటిని అదే ప్రదేశంలో ఉంచరాదని, ఇట్లా చేస్తే కోర్టు తీర్పును భంగ పరిచినట్లవుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం వీధి కుక్కలను నిర్ధేశిత ఆశ్రమాలకు తరలించి, వాటి బాధ్యతను గ్రామాల్లో పంచాయతీలు, పట్టణాల్లో మున్సిపాలిటీలు తీసుకోవాలి. ప్రైవేటు, ప్రభుత్వ భవన సముదాయాలకు కుక్కలు లోపలికి రాకుండా చూడాలి.

బహిరంగ ప్రదేశాల్లో కుక్కలు నిషేధం..

బహిరంగ ప్రదేశాలలో కుక్కలు సంచరించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల నెత్తిన పెట్టింది. వీధి కుక్కల నుంచి ప్రజలకు కాపాడటమే కాకుండా, వీధి కుక్కలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికే ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కుక్కలకు బహిరంగ ప్రదేశాలలో ఆహారం పెట్టడం కూడ ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుంది. పట్టణాల్లో కుక్కలకు మున్సిపాలిటీ వారే ఆశ్రయం కల్పించాలి. రాబిస్ నివారణ చర్యలు పెంచాలి. నేషనల్ హైవే రోడ్లపై కుక్కలు, గొర్రెలు, మేకలు, బర్రెలు, తిరగడం కూడా నిషిద్ధమే. దీన్ని నేషనల్ హైవే రోడ్డు అథారిటీస్‌వారు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు శాఖ అధికారులు అమలు చేయాలి.

8 వారాల్లో పూర్తి చర్యలకు ఆదేశం..

కుక్కల సంరక్షణ తీర్పును ఎనిమిది వారాల్లో అమలు చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. గడువు తక్కువగా ఉండటంతో మున్సిపల్ అధికారులు ఇప్పటి నుంచే కుక్కలను పట్టుకుని వాటిని తరలించే పని చేపట్టారు.

కుక్కలను పట్టుకునే పని ప్రారంభించాం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జనసంచారంలో ఉండే వీధి కుక్కలను పట్టుకునే చర్యలు ప్రారంభించాం. ఇప్పటి వరకు సుమారు 200 పైగా కుక్కలను పట్టుకొని గార్గేయపురం డంప్ యార్డు కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో వదిలిపెట్టాం. పందిపాడు సమీపంలో నాలుగు ఎకరాల స్థలాన్ని గుర్తించాం. త్వరలోనే అక్కడ తగిన ఏర్పాట్లు చేస్తాం. ఆసుపత్రులు, పాఠశాలలకు ప్రహరీ నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేశాము.

● పి.విశ్వనాథ్, నగర పాలక కమిషనర్, కర్నూలు

అసంబద్ధ విభజన..!

(5వ పేజీ తరువాయి)

ఈ ఐదు రోడ్లకు 2-15 కిలోమీటర్లు దూరంలోనే గ్రామాలు ఉన్నాయి. పెద్దహరివాణం, యడవల్లి, బలదూరు గ్రామాలు మాత్రమే 23-27 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. నాలుగు మండలాలుగా విభజిస్తే ఆదోని అర్బన్ మినహా మిగిలిన మూడు మండలాలకు ఒక్కో మండలానికి 15 గ్రామాలు వస్తాయి. పెద్దహరివాణంకు 10-12 కిలో మీటర్లు చుట్టూ ఉన్న ఆదోని, హోళగుంద మండలాలలోని గ్రామాలు కలిపి పెద్దహరివారం మండలం, పెద్దతుంబళం చుట్టూ 10-12 కిలో మీటర్ల దూరంలో ఉండే ఆదోని, పెద్దకడబూరు మండలాల్లోని గ్రామాలను కలుపుతూ పెద్దతుంబళం మండలంగా, మిగిలిన గ్రామాలు ఆదోని మండలంలోనే ఉంచి విభజన చేసి ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదు. ఇందుకు విరుద్ధంగా కొత్తగా పెద్దహరివాణం మండలం ఒక్కటే ఏర్పాటు చేయడం. ఆ మండలంలో 25-35 కిలో మీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు కలపడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కొత్తగా మండలం వచ్చిందనే సంతోషం కూడా లేకుండా పోయింది.

ఆదోని జిల్లా కోసం ఉద్యమాలు ఉధృతం

ఆదోని జిల్లా సాధన ఉద్యమం ఉధృతం అవుతోంది. ఆదోని పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఆదోని పట్టణంలోని కోట్ల కూడలిలో వివిధ వర్గాల ప్రజలు, మేధావులు, విద్యార్థులు రిలే దీక్షలు మద్దతు పలికారు. పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గ పల్లెలు సమాగ్రాభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా తోనే సాధ్యమని జిల్లా సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా ఆదోని డివిజన్ నిర్లక్ష్యానికి గురి అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తే ఆ సంఘానికి నేతృత్వం వహిస్తున్న మంత్రులు కనీసం ఇటువైపు కూడా రాకుండా పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రజలను మోసం చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. తమ మనోభావాలను ఆకాంక్షను గౌరవించకపోవడంపై త్వరలోనే గుణపాఠం చెప్తామన్నారు. ఇదిలా ఉండగా మంత్రాలయంలో నియోజకవర్గంలోని ఆదోని జిల్లాకోసం పోరాటాలు కొనసాగాయి. విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులతో పాటు వైసీపీ శ్రేణులు నిరసనలకు మద్దతు పలికాయి. మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో నిరసనకారులు మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

పెద్దహరివాణం మాకొద్దు

ఆదోని మండలం నుంచి పెద్దహరివాణం గ్రామాన్ని విభజించి మండలంగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదోని మండలంలోని 16 గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మదిరె క్రాస్ వద్ద ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిపై చిన్నహరివాణం, మదిరె, చిన్నగోనేహాళ్ గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేశారు. 16 గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఆగ్రామాలను పెద్దహరివాణంలో ఎలా కలుపుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 35 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాన్ని ఎలా మండల కేంద్రంగా పరిగణిస్తారని, ఈ ఆలోచన ఎలా వచ్చిందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిలో బైఠాయించి ఆందోళన చేపట్టారు.



మంత్రాలయంలో ధర్నా చేస్తున్న నాయకులు

వాన తాకిడి

- తడిసిన వరి, మొక్కజొన్నలు
- జలమయమైన రహదారులు
- ఆందోళనలో రైతులు







చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్లలో ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు

చాగలమర్రి/ ఉయ్యాలవాడ/ కొలిమిగుండ్ల , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ ప్రభావం చూపుతోంది. చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల మండలాల్లో గురువారం ఉదయం భారీ వర్షాలు కురిశాయి. వాన తాకిడికి పంటలు దెబ్బతిన్నాయి. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు జలమయమయ్యాయి. రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయింది. చాగలమర్రి మండలం పెద్దబోదనం, గొడిగనూరు, ముత్యాలపాడు, మద్దూరు, చాగలమర్రి, మూడురాళ్లపల్లె రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న, వరి ధాన్యం రైతులకు నష్టం వాటిల్లింది. కోతకొచ్చిన వరి పంట నెలకొరిగింది. ఉయ్యాలవాడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిసిపోయింది. ధాన్యంపై పట్టలు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పట్టల కింద నుండి నీరు చేరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఈ ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయరనే భయం రైతులను వెంటాడుతోంది. ప్రభుత్వం కొని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీడీపీ ఎడమ కాలువకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న జేసీ

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ కింద ఉన్న ఆయకట్టు భూముల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు గాను గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఎడమ కాలువ నీటిని విడుదల చేశారు. నీటి విడుదల పూజా కార్యక్రమంలో జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్, టీడీపీ మండలకన్వీనర్ తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు. ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం రైతుల అవసర నిమిత్తం 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ కాలువ కింద 3,500 ఎకరాలు సాగు కావాల్సి ఉంది. ఈ ఏడాది దాదాపు 1300 నుంచి 1400 ఎకరాల లోపు సాగు కావచ్చునని అధికారులు చెబుతున్నారు. జేసీ నూరుల్ ఖమర్ ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది?, ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు?, ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలు ఎన్ని ఎన్ని వేల ఎకరాలు ప్రాజెక్టు విస్తరించి ఉంది? అని ఏఈ మహమ్మద్ ఆలీని అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు రైతులకు రబీ సీజన్‌లో సాగునీటి సమస్య రాకుండు చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఉగ్రనరసింహుడు, హెచ్‌కైరవాడి సహకార సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రాజేష్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖపై చిన్నచూపు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కాగితాలకే పరిమితమైన కొలువులు
- పనిభారంతో సతమతమవుతున్న ఉద్యోగులు



జిల్లా పరిశ్రమల కేంద్రం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల శాఖపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. జిల్లా పరిశ్రమల కేంద్రంలో కీలకమైన స్థానాలు ఖాళీ గా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, వాటి అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈతరుణంలో వాటి అమలుకు అవసరమైన ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అందుబాటులో ఉన్న సిబ్బందిపైనే పనిభారం పడటంతో పాటు పలు రకాల పథకాలపై కూడా వీటి ప్రభావం పడతోంది.

కీలక స్థానాలు ఖాళీ

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధిలో పరిశ్రమల అభివృద్ధి అధికారుల(ఐపీవో) పాత్ర ఎంతో కీలకం. ఉమ్మడి జిల్లా విభజనానంతరం కర్నూలు జిల్లాకు 8మంది ఐపీవోలు అవసరమని సంబంధిత అధికారులు సూచించారు. వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నం. ఉద్యోగుల ఆవశ్యకతకు, ప్రభుత్వం మంజూరు చేసిన స్థానాలకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి పొంతన లేకుండా పోయింది. 8స్థానాలకుగాను ప్రభుత్వం ఆరింటిని మంజూరు చేసింది. ఇందులో 5మంది క్షేత్రస్థాయిలో పనిచేసేలా, ఒకరు కార్యాలయంలో పత్రాల పరిశీలన చేసేలా విధులను కేటాయించారు. ఈ నియామకాలు కాగితాలకే పరిమితమయ్యాయి, తప్ప ఆచరణలో సాధ్యం కాలేదు.

ఆరుగురు ఐపీవోలకు గాను..

ఆరుగురు ఐపీవోలకు గాను ఇద్దరు మాత్రమే కార్యాలయంలో అందుబాటులో ఉండగా, మరొకరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లటం గమనార్హం. వీటితో పాటు పరిశ్రమల పర్యవేక్షణలో కీలకమైన సహాయ సంచాలకుని స్థానం ఖాళీ పడింది. ఐపీవోలకు మార్గనిర్దేశనం చేస్తూ క్షేత్రస్థాయికి, కార్యాలయానికి అనుసంధానకర్తగా ఉండే ఈస్థానం ఏడాది కాలంగా భర్తీ కాకపోవటం కూడా పరిశ్రమల అభివృద్ధిలో ప్రతికూలాంశమే. కార్యాలయ వ్యవహారాల్లో చురుగ్గా ఉండే ఇద్దరు దిగువ శ్రేణి సహాయకుల్లో ఒకరి స్థానం, నాల్గవ తరగతి ఉద్యోగుల్లో మరొకరి స్థానం సైతం భర్తీ కాలేదు. మొత్తం ఇరవై మంది ఉద్యోగులు అవసరంగా కాగా, కేవలం 11 మందితోనే కార్యాలయాన్ని భారంగా నిర్వహిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



శాఖలోని ఖాళీలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. నివేదిక ఆధారంగా భవిష్యత్తులో జరిగే నూతన నియామకాల ద్వారా ఖాళీలను భర్తీ చేస్తాం.

● అశోక్ కుమార్, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం, కర్నూలు

పథకాల అమలుపై ప్రభావం

ఔత్సాహిక పారిశ్రామికవేతల్లకు ప్రోత్సాహం, ఉద్యం నమోదు, తదితర పనులు పరిశ్రమల శాఖ పరిధిలోనే నిర్వహిస్తుండటంతో ఈ కీలక స్థానాలు ఖాళీ కావటం శాఖపరంగా ఇబ్బందిగా మారింది. ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీ అత్యంత అవశ్యకంగా మారింది. లేని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక పథకాల అమలు, పరిశ్రమల ఏర్పాటు పనులు మందకొడిగా సాగే ప్రమాదం లేకపోలేదు.

భూ సేకరణకు నిధులు ఇవ్వండి..!



అసంపూర్తిగా ఆర్డీఎస్ హెడ్ స్లూయిస్ పనులు

- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు తక్షణమే చేపట్టాలి
- జీఆర్‌పీ నిర్వహణకు ఐదేళ్లకు నిధులు కేటాయించాలి
- పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్
- సానుకూలంగా స్పందించిన స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టుల పనులు కాంట్రాక్టు సంస్థలు చేపట్టాలంటే భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అమరావతిలో బుధ, గురువారం రెండు రోజులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సమావేశం చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. పీఏసీ సభ్యులైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బూర్ల రామాంజనేయులు, అరిమిల్లి రాధాకృష్ణ, అశోక్‌రెడ్డి, నక్క ఆనంద్, కోళ్ల లలితకుమారి, విష్ణుకుమార్‌రాజు సహా జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా హాజరయ్యారు. జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుపై చర్చించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే ఆశయంతో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని 2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొని జీవో ఆర్టీ నం.76 జారీ చేసి, రూ.1,985.42 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆర్డీఎస్ అనకట్ట వద్ద హెడ్ స్లూయిస్, కాలువ నిర్మాణం పనులను మొదలు పెట్టారని, గత వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని గుర్తు చేశారు. మన కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చి తక్షణం పనులు మొదలు పెట్టాలనే ఆదేశాలు ఇచ్చారు. అయితే.. భూ సేకరణ చేయకపోవడంతో పనులు చేయలేని పరిస్థితుల్లో ఉందని, అందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే.. గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిర్వహణకు ఏటేటా ప్రతిపాదనలు తయారు చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయని, ఐదేళ్లకు ఒకేసారి డీపీఆర్ తయారు చేసి నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్ట్ సంస్థలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సూచించారు. పత్తికొండ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ తాను పత్తిపాడు ఎమ్మెల్యే అయినా.. తన స్వగ్రామం ఆలూరు అని, వేదవతి ప్రాజెక్టు పూర్తయితే ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. తక్షణం నిధులు ఇచ్చి భూసేకరణ చేసి ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలనే అభిప్రాయానికి జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సానుకూలంగా స్పందించారు.



హంద్రీనీవా కాలువ వద్ద ఆగిపోయిన వేదవతి ప్రాజెక్టు స్టేజ్-2 పంప్‌హౌస్ పనులు

డీమార్టులో మహిళల చేతివాటం

- రూ.5వేలకు బిల్లు చెల్లించి, రూ.25వేల సరుకుతో ఉడాయించే యత్నం..
- పోలీసులకు అప్పగించిన నిర్వాహకులు

కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న డీ మార్ట్ షాపింగ్ మాల్‌లో ఇద్దరు మహిళలు చేతివాటం ప్రదర్శించారు. రూ.5వేల బిల్లు చెల్లించి రూ.25వేల సరుకుతో ఉడాయించే ప్రయత్నం చేయగా సిబ్బంది గమనించి పోలీసులకు అప్పగించారు. వివరాల మేరకు.. గురువారం సాయంత్రం బురఖా ధరించిన ఇద్దరు మహిళలు సరుకులు కొనుగోలు చేసేందుకు డిమార్టు వచ్చారు. రూ.5వేల సరుకులు కొనుగోలు చేసినట్లు బిల్లు వేయించుకున్నారు. బయటకు వచ్చే సమయంలో సరుకులు ఎక్కువగా ఉండటంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ గార్డులు తనిఖీ చేయగా నాలుగైదు బ్యాగుల్లో సరుకులు ఎక్కువగా కనిపించాయి. దీంతో స్టోర్ నిర్వాహకులు సీసీ కెమెరాలను పరిశీలించగా వీరి భాగోతం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.25 వేల విలువైన సరుకులు, వస్తువులు రహస్యంగా చోరీ చేసినట్లు గుర్తించి నిలదీశారు. మహిళలు డిమార్టు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు. మేనేజర్ ఇద్దరు మహిళలను నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు. కాగా ఆ మహిళలు తమ పేర్లు, చిరునామా తప్పుగా ఇచ్చినట్లు సమాచారం.

దొంగ అరెస్టు

- నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తమూలపెద్దమ్మ ఆలయంలో సెప్టెంబరు 9న గుర్తు తెలియని దుండగులు ఆలయ గేటును ధ్వంసం చేసి హుండీ చోరీ చేశారు. ఈ కేసులో ఏఎస్పీ మందాజావలి ఆల్ఫ్రెస్ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. దొంగతనానికి పాల్పడ్డ ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం బోలుపల్లె గ్రామానికి చెందిన సాయిరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రూ.48,257 నగదు, అమ్మవారికి చెందిన 520 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

కండక్టర్‌పై వైసీపీ నాయకుడి దాడి

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోల్‌మాన్ పేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గుడిసె రామాంజనేయులు ఆర్టీసీ బస్సు కండక్టర్ పొద్దుటూరు కమల్‌పై గురువారం కలోమాన్ పేటలో దాడి చేసి గాయపరిచాడు. వివరాలివీ.. ఆదోని డిపోకు చెందిన కోసిగి-తుంగభద్ర బస్సులో ఆదోని నుంచి కోల్‌మాన్‌పేట వరకు వచ్చిన రామాంజనేయులు బస్సు దిగే క్రమంలో కండక్టర్‌ను తోసుకుంటూ కిందకు దిగుతుండటంతో చూసుకుని నిదానంగా దిగండి అని కండక్టర్ చెప్పగా రామాంజనేయులు కండక్టర్‌పై దాడి చేశాడు. దీంతో కండక్టర్ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.



కండక్టర్‌ను బెదిరిస్తున్న గుడిసె రామాంజనేయులు

సచివాలయ ఉద్యోగి మృతి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డు ఇందిరానగర్ వెల్ఫేర్ సచివాలయ ఉద్యోగి రాజారత్నం(40) గురువారం తెల్లవారుఝామున మృతి చెందారు. వగరూరు గ్రామానికి చెందిన రాజారత్నం సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందారు. సచివాలయ ఉద్యోగులు రాజారత్నంకు నివాళి అర్పించారు. కమిషనర్ గంగిరెడ్డి వగరూరు గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. పట్టణంలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు సాయంత్రం సోమప్ప సర్కిల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాజారత్నం (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన గొల్ల రవి(38) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో వంట గదిలో ఉరి వేసుకొని ఉన్నాడు. రవికి ఇంటి పక్కన వారితో ఇటీవల గొడవ జరిగిందని, ఈ విషయంలో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారని అతడి భార్య అంజినమ్మ పోలీసులకు తెలిపారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.



రవి (ఫైల్)

పాము కాటుతో విద్యార్థి మృతి

కౌతాళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుతపల్లి గ్రామంలో పాటుకాటుతో విద్యార్థి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. కురువ లింగన్న, ఉరుకుంద దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అర్జున్(11) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రపోయాడు. తెల్లవారుజామున నిద్రలోనే పాము కాటు వేయడంతో తనకు ఏదో కుట్టినట్లు అయిందని తల్లిదండ్రులకు చెప్పాడు. బాలుడి నోటి నుంచి నురుగు వస్తుండటంతో పాము కాటుకు గురైనట్లు గుర్తించి ఆదోని ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. గురువారం ఎంఈవో-2 శోభారాణి క్లస్టర్ హెచ్‌ఎం హరి ప్రసాద్‌తో కలిసి గ్రామానికి వెళ్లి విద్యార్థి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మట్టి ఖర్చులకు తగిన ఆర్థిక సాయం అందించారు.



అర్జున్ (ఫైల్)

ఆదోని జిల్లా.. ప్రజల ఆకాంక్ష!



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న తిక్కారెడ్డి

- ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- సీఎం చంద్రబాబుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విన్నపం

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఆదోని జిల్లా అనేది.. పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్ష. జిల్లాల పునర్విభజనలో ఆదోని ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు రోడ్డెక్కారు. ఆందోళనలు చేస్తున్నారు. జిల్లా ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి..' అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్పతో కలసి గురువారం రాత్రి ఆయన ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఆదోని జిల్లా సాకారం చేయడంతో పాటు అసంబద్ధంగా జరిగిన ఆదోని మండల విభజనను సరి చేయాలని తిక్కారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదోని జిల్లా కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ముందు ఆదోని జిల్లా చేస్తామని హామీ ఇచ్చామా? అని సీఎం చంద్రబాబు అడిగారని, ఆ సమయంలో ఆదోని జిల్లా డిమాండ్ లేకపోవడంతో హామీ ఇవ్వలేదని తిక్కారెడ్డి వివరించారు. ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమయంలో జిల్లా పార్టీ నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని సీఎం చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్ర, ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులు చర్చించి జిల్లా ఏర్పాటుపై సాధ్యసాధ్యాలు, రాజకీయ అంశాలపై సమగ్ర నివేదిక తెప్పించుకుంటానని సీఎం చెప్పారని తిక్కారెడ్డి తెలిపారు. అదేవిధంగా జిల్లాలో టీడీపీ తాజా పరిస్థితిపై అధినేత చంద్రబాబుకు నివేదిక అందజేసినట్లు పేర్కొన్నారు.

సూర్యఘర్‌పై ప్రచారం చేయండి

- కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకోవాలని ప్రచారం చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించారు. గురువారం ఛాంబర్‌లో అధికారులతో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంటుపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని అవగాహన కల్పించాలన్నారు. మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి దేశం అంతటా కోటి గృహాలకు సౌర వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్లాంటు ఇస్తుందన్నారు. సమావేశంలో ఎస్‌ఈ ప్రదీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కోవెలకుంట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల, ఉప్పలూరు గ్రామాల మధ్య గురువారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. నంద్యాల నుంచి కోవెలకుంట్లకు వెళ్తున్న లారీ ఉప్పలూరు కలుగొట్ల దగ్గరికి వచ్చేసరికి బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా సైడ్ రోడ్డులో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి గుంతలో పడింది. లారీ డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

రాయల్టీ లేని లారీలు సీజ్

బేతంచెర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ నాపరాళ్ల ఫ్యాక్టరీలలో లోడ్ చేసుకుని రాయల్టీ లేకుండా వెళ్తున్న లారీలను ప్రైవేట్ రాయల్టీ కంపెనీ యాజమాన్యం కర్నూలు ఏడీఎంజీ అధికారులకు అప్పజెప్పినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయ రెడ్డి తెలిపారు. బేతంచర్ల నుంచి కర్ణాటక తదితర ప్రాంతాలకు రాయల్టీ లేకుండా నాపరాళ్లను రవాణా చేయడంతో ప్రైవేట్ రాయల్టీ యాజమాన్యం ఏడీఎంజీ అధికారులకు అప్పగించారని ఆయన తెలిపారు. సీజ్ చేసిన లారీలను బేతంచర్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలపై కొనసాగుతున్న దాడులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం కిడ్స్ వరల్డ్ సమీపంలోని నేషనల్ టీ స్టాల్ అండ్ స్వీట్ షాపునకు సంబంధించి రూ.6.58 లక్షలు, గీతాంజలి నర్సింగ్ కాలేజీకి సంబంధించి రూ.5.53 లక్షల బకాయి ఉండటంతో రెండు వ్యాపార సముదాయాలను సీజ్ చేశారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి అధ్వర్యంలో మొండి బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ 6 సంవత్సరాలకు పైగా ఆస్తి పన్ను చెల్లించకపోతే ఆర్‌ఆర్ యాక్టు ప్రకారం ఆస్తి జప్తునకు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు నగరంలో రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, కార్పొరేషన్‌కు నష్టం కలిగించవద్దని సూచించారు. త్వరలో టాప్-100 మొండి బకాయిదారుల వివరాలు ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయ భవనాల బకాయిల కోసం లేఖలు రాస్తామన్నారు. ఆర్వో జునైద్, ఆర్ఐలు రాజు, శ్రీకాంత్, భార్గవత్, కే.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు రైలు నడపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు రైలు నడపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. గురువారం ఢిల్లీలో పార్లమెంటు సభ్యుడు సచ్చిదానందకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర రైల్వే మంత్రితో ఈ విషయంపై చర్చించాలని గౌస్‌దేశాయ్ కోరారు. కర్నూలు నుంచి నేరుగా విజయవాడకు రైల్వే సౌకర్యం లేకపోవడంతో బస్సులను ఆశ్రయంచాల్సి వస్తోందని వివరించారు

సమస్యల పరిష్కారానికి సానుకూలత



ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- ఆరు అంశాలపై ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు
- ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

నంద్యాల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఉదయానంద హోటల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి 6 అంశాలపై చర్చించి సానుకూలంగా స్పందించారన్నారు. వెంటనే ఉత్తర్వులు కూడా అధికారులు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో 32 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. పెన్షనర్లకు కాంటమ్మైజేషన్ 3 శాతం, ఇంటి బాడుగలకు 4 శాతం కోత విధించిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ. 12 వేల కోట్ల పాత బకాయిలు చెల్లించిందన్నారు. 2022 నుంచి 2024 సరెండర్ లీవ్‌లకు బకాయిలు కూడా గత ప్రభుత్వం చెల్లించలేదన్నారు. 25 లక్షల కుటుంబాల ఉద్యోగుల కుటుంబాలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని, పేమెంట్, ఉద్యోగుల హెల్త్‌కార్డుకు ఇన్సూరెన్స్ అనుసంధానంలో, నూతన వైద్యులను నియమించడంలో, సీలింగ్ పరిమితి పెంచడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ పాల్గొన్నారు.

గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి




మాట్లాడుతున్న ఇసాక్‌బాషా, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 2014 నుంచి అస్యూరెన్స్‌కు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటీ చైర్మన్ ఇసాక్‌బాషా అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. వెలుగోడు రిజర్వాయర్ పురోగతి, గతంలో ఇచ్చిన హామీల అమలు ఎంత వరకు జరిగిందనే అంశాలపై చర్చించారు. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో షాదీఖానాల నిర్మాణం, దుల్హాన్ స్కీం నిధుల విడుదల ఎలా జరుగుతున్నదీ తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న దేవాలయాలు, పునర్నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు సభ్యులు శ్రీనివాస్, రామచంద్రరెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ఉపాధి జాబ్ కార్డు

- పీడీ వెంకటరమణయ్య



జాబ్‌కార్డు నమూనా

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగియడంతో గ్రామాల్లోని రైతులు, కూలీలు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పథకం కింద పనులు చేయాలంటే తప్పనిసరిగా జాబ్ కార్డు ఉండాలని షరతు విధించడంతో రైతులు, కూలీలు ఇప్పటిదాకా జాబ్‌కార్డు పొందేందుకు వారాలు, నెలల తరబడి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకంది. వారం కింద కేంద్ర ప్రభుత్వం జాబ్‌కార్డులు పొందేందుకు కేవలం 48 గంటల కాలపరిమితిని మాత్రమే గడువు విధిస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలు ఊరట చెందుతున్నారు. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు సైతం ఇబ్బందులు ఉండేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఈకేవైసీ అమలుకు శ్రీకారం చుట్టడంతో అర్హులైన రైతులకు కేవలం 48 గంటల్లోనే ఉచితంగా కొత్త జాబ్‌కార్డు అందించేందుకు మార్గం సుగమమైంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే జాబ్‌కార్డు నకలు అందించేందుకు నీటి యాజమాన్య సంస్థ చర్యలు తీసుకోనున్నారు. అదే విదంగా సభ్యుల పేర్లు, నమోదు, చిరునామా చేర్పులు, మార్పులకు సైతం ఆదేశాలు అందాయని, గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ విధానం కొత్తకార్డులు తీసుకునేందుకు మంచి అవకాశమని నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య గురువారం తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

నంద్యాల టౌన్ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం రోడ్డు వద్ద బుధవారం వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ హరినాథరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ముసుగు వేసుకుని వచ్చి తన భర్త మీద దాడి చేసినట్లు బాధితుడి భార్య కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలుకా పోలీసులు గురువారం విచారించారు. అదే గ్రామానికి చెందిన రాజేశ్, తులసిరెడ్డి, నాగేశ్వరరెడ్డితో పాటు మరో ఐదుగురుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ, తెలుగు, ఉర్దూ అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో 1, 2 మేరీ మార్గరేట్, అయూబ్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఐదు నెలల తాత్కాలిక కాలపరిమితికి సంబంధించి ఈనియామకాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 5వ తేదీలోగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో తమ దరఖాస్తులు అందించాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 చొప్పున గౌరవ వేతనాలు అందించనున్నట్లు వెల్లడించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సురేష్ కుమార్

మిడుతూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సచివాలయ డిప్యూటీ ఎంపీడీవోగా సురేష్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జిల్లాపరిషత్ కర్నూలులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై మిడుతూరు మండలానికి వచ్చినట్లు ఎంపీడీవో దశరథ రామయ్య తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఆత్మకూరు, డిసెం బరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధంగా చదివితేనే ఉద్యోగావకాశాలు వరిస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాలలో బ్యాంకు ఉద్యోగాలపై కామర్స్ డిపార్టుమెంట్, శ్రీసాయికృష్ణ బ్యాంకింగ్ సెంటర్ వారు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐడీపీఎస్, క్లర్క్, పీవో ఉద్యోగాలకు డిగ్రీ స్థాయి నుంచే ప్రణాళికాబద్ధంగా ప్రయత్నించాలని సూచించారు. ఉద్యోగాల శిక్షణలో మెలకువలు ఎంతో ఉపయోగపడతాయని న్నారు. కార్యక్రమంలో ట్రైనర్ గంగాధర్, ఇమ్మాన్యుయేల్, అధ్యాపకులు అనిల్‌కుమార్, నాగన్న తదితరులు ఉన్నారు.

నేడు తిమ్మాపురానికి ఎమ్మెల్యే బుడ్డా రాక

మహానంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్)కు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఎంఈవో రామసుబ్బయ్య గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై విద్యార్థుల తల్లితండ్రులతో నేరుగా మీట్ అవుతారని అన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

పాణ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆలిండియా క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం విద్యార్థులను కళాశాల ఎండీ శివరాం, హెచ్‌ఓడి ఫరూక్, రమాదేవి, పీడీ చంద్రారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2న జరిగిన జేఎన్‌టీయూఏ బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో సీఎస్సీ విభాగానికి చెందిన ఉదయ్‌కిరణ్, శ్రీవాణి, శ్రీలత, డేటా సైన్స్ విభాగానికి చెందిన జతిన్ బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

'చంద్రబాబుకు రుణపడి ఉంటాం'

నంద్యాల టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రుణపడి ఉంటామని రాయలసీమ దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాల సుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, రవి, రమణ పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

నందికొట్కూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకురాలు చెన్నా సుమలతకు భౌతికశాస్త్ర విభాగంలో డాక్టరేట్ లభించింది. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎమ్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, సుమలత 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది చేంజ్ ఇన్ స్ట్రక్చరల్ ల్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ డైస్ప్రోజియం, టెర్బియమ్, డైస్ప్రోజియం- టెర్బియమ్ అయాన్ డోప్డ్ జింక్, బిస్మత్ బేరియమ్ బోరో ఫ్లోరో టెల్యూరైట్ గ్లాసెస్ ఫర్ లేజర్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేసి కె.ఎల్. విశ్వవిద్యాలయంలో తన పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆవిశ్వవిద్యాలయం సుమలతకు డాక్టరేట్ ప్రదానం చేసింది. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం సన్మానించారు.

వ్యాపారంలో నమ్మకం ముఖ్యం

- సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు

నందికొట్కూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నమ్మకం ముఖ్యమని సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని మిడ్తూరు రోడ్డులోని తమ్మడపల్లి విక్టర్ శేఖర్‌ల ఇండియన్ ఆయిల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సవిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, ఎస్‌ఐ చంద్రశేఖర్ కేక్ కట్‌చేశారు. నిర్వాహకులు వినియోగదారులకు మిఠాయిలను పంచి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మెడపల్లి విక్టర్, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్వేసి గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆలయంలో గురువారం 30వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రామసుబ్బారెడ్డి, హైమావతమ్మ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించి కాశిరెడ్డినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు గనిలో సైరా నరసింహారెడ్డి నాటకం

గడివేముల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గడివేముల మండలంలోని గని గ్రామంలో అవధూత కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శుక్రవారం కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సై.సైరా నరసింహారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం ప్రదర్శన ఉంటుందని అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య వెల్లడించారు. టీజీవీ కళాక్షేత్రం, బుడ్డా వెంగళరెడ్డి కళావేదిక సంయుక్తంగా సమర్పిస్తున్న ఈ నాటక ప్రదర్శన రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. నాటక అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నాటకాన్ని తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పల్లేటి కులశేఖర్ రచించిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారని కార్యక్రమ కన్వీనర్ వెలుగోడు కె.వి. రమణ తెలిపారు.

అద్దె భవనాలే దిక్కు

- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- అద్దెలు భరించలేక మారుమూల కాలనీల్లో ఏర్పాటు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


అద్దె భవనంలో సాగుతున్న ఎక్సైజ్ పోలీసు స్టేషన్


అద్దె భవనంలో దేవదాయ శాఖ కార్యాలయం

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్ల తరబడి అద్దెభవనాల్లో కొనసాగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. చాలీచాలని అద్దె గదుల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ప్రధానమైన ప్రాంతాల్లో అద్దె భవనాలకు బాడుగలను భరించలేక మారుమూల కాలనీల్లో తక్కువ బాడుగులకు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలను గుర్తించలేక ప్రజలు అయోమయానికి గురి అవుతున్నారు.

కార్యాలయమే లేదు

ఉద్యాన శాఖాధికారికి కార్యాలయంలేక ఆమె వ్యవసాయ కార్యాలయంలోనే ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యానశాఖ సేవలను పొందుకు రైతులకు ఇబ్బందులు తప్ప డం లేదు. పట్టణంలోని అన్ని బ్యాంకుల్లో అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఈ ప్రభుత్వ కార్యాలయాలన్ని ఏళ్లతరబడి అద్దెభవనాల్లో కొనసాగుతుండటంతో ప్రతి నెల వీటి బాడుగలు రూ.లక్షల్లో చెల్లిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువువ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తికమకపడాల్సిన పరిస్థితి

పట్టణంలోని అక్కిరాజుకాలనీలోని మారుమూల కాలనీలోని ఓఇంట్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యాలయాన్ని గుర్తుపట్టేందుకు తికమక పడాల్సిన పరిస్థితి నెలకొంది. సారా, బెల్ట్ ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపే ఈ శాఖ కార్యాలయం మారుమూల కాలనీలో ఉండటంతో అసలు ఆత్మకూరు ఎక్సైజ్ శాఖ ఉందన్న విషయాన్ని సైతం ప్రజలు మరిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గుర్తించడం కూడా కష్టమే..

దేవదాయశాఖ కార్యాలయం అప్పారావువీధిలోని ఓ కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని గుర్తించడం కూడా కష్టమే. సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయం గౌడ్‌సెంటర్‌లో మొదటి అంతస్తులో చిన్నగదిలో ఏర్పాటుచేశారు. వాస్తవానికి కార్మికులకు ఏదైనా అవగాహన కార్యక్రమాలు, ఇతర సమావేశాలను ఇక్కడ నిర్వహించలేని పరిస్థితి. ఉద్యానశాఖకు సొంత కార్యాలయం లేకపోవడంతో అధికారి అగ్రిల్యాబ్ లోనే ఉంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం కూడా ప్రస్తుతం అద్దెభవనంలోనే ఉంది.

'మద్దూరు' సేవలు మరవలేనివి

- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య
- సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మద్దూరు సుబ్బారెడ్డి సేవలు మరవలేనివి అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కొనియాడారు. బ్రాహ్మణకొట్కూరులో నంద్యాల మాజీ ఎంపీ మద్దూరు సుబ్బారెడ్డి 113 వ జయంతి అలాగే ఆయన స్థాపించిన పాఠశాల 64 వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఘనంగా నిర్వహించారు. అక్కడ నెలకొల్పిన సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మద్దూరు సుబబ్బారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాడు విలువలతో కూడుకున్న రాజకీయాలకు వన్నె తెచ్చిన నాయకుడు మద్దూరు సుబ్బారెడ్డి అని అన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, సర్పంచ్ మరియమ్మ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు సినిమా టాకీస్ రామిరెడ్డి, మాజీసర్పంచ్ ఖలీలుల్లాబేగ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పగిడ్యాల: సచివాలయ సిబ్బంది విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జయసూర్య హెచ్చరించారు. గురువారం మండలంలోని ప్రాతకోట సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది వివరాలు, హాజరుతో పాటు రికార్డులను పరిశీలించారు. తనిఖీ సమయంలో కేవలం ముగ్గురు సిబ్బంది ఉండటంతో మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్లారంటూ ప్రశ్నించారు. సిబ్బంది పనితీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఆదేశించారు. సమయానికి బస్సులులేక ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది తెలపడంతో ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమయానికి బస్సుసౌకర్యం కల్పించాలని సూచించారు. మండల కన్వీనరు మహేశ్వరరెడ్డి నాయకులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధితులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే జయసూర్య గురువారం అందజేశారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన నాగరత్నంగౌడ్‌కు రూ.1.10 లక్షలు, ఎం.ఘణపురానికి చెందిన షేక్ సద్దాంకు రూ.88వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిలేటి గౌడ్, షమిన్, చంద్రేష్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు సేవలు మరింత చేరువ : కలెక్టర్


డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డీడీవో కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వర్చువల్‌గా రాష్ట్రంలోని పలు డీడీవో కార్యాలయాలు ప్రారంభించారు. ఈక్రమంలోనే పట్టణ సమీపంలోని రైతునగరంలో ఏర్పాటుచేసిన డీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి శాఖలను డివిజన్ స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోకి తీసుకురావడంతో సేవల అందుబాటు పెరగడమే కాకుండా గ్రామీణాభివృద్ధి వేగవతం అవుతుందన్నారు. డీపీవో లలితాబాయి, డీఎల్‌డీవో సుబ్బారెడ్డి, ఎంపీడీవో సుగుణశ్రీ, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు..

నంద్యాల నూనెపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సీజనల్ వ్యాధులు, వైద్య ఆరోగ్య శాఖ ప్రాధాన్యత అంశాలు, వరి సేకరణ, ఎరువుల సరఫరా అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

రేషన్ షాపుల్లో రాగుల పంపిణీ : జేసీ

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుదారులకు ఈనెల నుంచి బియ్యం, పంచదారతో పాటు రాగులు అందిస్తున్నట్లు జేసీ కార్తీక్ గురువారం తెలిపారు. మూడుకిలోల బియ్యం బదులుగా మూడుకిలోల రాగులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మెడికల్ కళాశాలలో 2024బ్యాచ్ విద్యార్థులకు గురువారం ఈఎస్ఈ పియర్‌మెంటర్ ట్రైనింగ్ (పీఎంటీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భావోద్వేగ ప్రథమ చికిత్సలో శిక్షణ ఇచ్చి సంక్షోభ పరిస్థితుల్లో సహ విద్యార్థులకు ఎలా తోడ్పడాలనే విధానాలను వివరించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతకు జ్ఞాపికను ఇస్తున్న పర్యావేక్షకురాలు దేవిక

శ్రీశైలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి పశ్చిమగోదావరికి చెందిన రామకృష్ణ రూ.లక్ష విరాళం ఇచ్చారు. గురువారం విరాళాన్ని ఆలయ పర్యావేక్షకురాలు దేవికకు అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదాలు, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు

శ్రీశైలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నిత్యం గ్రామంలో పారిశుధ్యాన్ని నిర్వహిస్తున్న కార్మికులకు ఎట్టకేలకు జీతాలు అందినట్లు టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సున్నిపెంటలో సుమారు 30 మంది పారిశుధ్య కార్మికులున్నారని, వారికి తొమ్మిది నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడేవారన్నారు. కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చొరవతో వారికి జీతాలు అందినట్లు తెలిపారు. దీంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా దత్త జయంతి


ఆత్మకూరులో పూజలందుకున్న దత్తాత్రేయుడు


పాములపాడు: సాయినాథుడికి హారతి ఇస్తున్న పీఠాధిపతి రామనందస్వామి

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం దత్తజయంతిని వైభవంగా నిర్వహించారు. సాయినాథుడిని విశేష పుష్పాలతో తీర్చిదిద్దారు. ఉదయం 6గంటలకు కాకడహారతి, 7.30గంటలకు దత్త అంశయైన షిర్డీసాయినాథుడికి నవవిధ అభిషేకాలు, పుష్పార్చన పూజాదికాలను శాస్రోక్తంగా జరిపారు. 8.30గంటలకు దత్తాత్రేయ స్వామి ప్రదక్షిణలు, 10.30గంటలకు సాయిసత్య వ్రతాన్ని నిర్వహిం చారు. దంపతులు సామూహిక వ్రతంలో పాల్గొని దత్తత్రేయుడి సేవలో తరించారు. రాత్రి 7గంటల నుంచి 8.30గంటల వరకు సాయి బాబా భజన మండలి భజన కార్యక్రమాలను చేపట్టారు. అర్చకులు దత్తజయంతి ప్రాముఖ్యతను వివరించారు. ఆ తర్వాత రాత్రి 8.45గంటలకు పల్లకీసేవ, 9 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన వితరణను చేపట్టారు.

నాగసాయి బ్రహ్మ విద్య ఆశ్రమంలో..

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని నాగసాయి బ్రహ్మ విద్య ఆశ్రమంలో పీఠాధిపతి సద్గురు రామనంద స్వామి ఆధ్వర్యంలో దత్తాత్రేయ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ స్వామివార్లకు అభిషేకం, హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలచే స్వామివార్లను అలంకరించారు. పల్లకీసేవా, అఖండ భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దత్తాత్రేయ దర్శన భాగ్యంతో సర్వ పాపాలు తొలగిపోతాయని పీఠాధిపతి పేర్కొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని పీఠాధిపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

త్రిఫల వృక్షం కింద

శ్రీశైలం: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో త్రిఫల వృక్షం క్రింద కొలువైఉన్న దత్తాత్రేయునికి జయంతి వేడుకలు శాస్త్రోక్తంగా జరిపించారు. గురువారం ఉదయం అర్చక వేదపండితులు త్రిమూర్తి స్వరూపులైన దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకాలు, విశేషార్చనలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.


ఆత్మకూరు డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సుస్థిర పాలనకు ప్రభుత్వం కృషి

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
- ఆత్మకూరు డీడీవో కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుస్థిరమైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ వేడుకకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఇన్‌చార్జ్ డీడీవో నాగేంద్రుడు, తహసీల్దార్ రత్నరాధిక, ఏడీఏ హేమలత హాజరయ్యారు. ముందుగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలోని అన్ని డీడీవో కార్యాలయాలను ప్రారంభించి తన సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినిపించారు. ఆ తర్వాత నూతన డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని విశిష్ట అతిథి హోదాలో ఎమ్మెల్యే బుడ్డా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లలో డీడీవో కార్యాలయాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుందని అన్నారు. సీఐ రాము ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, రవీంద్రబాబు, షాబుద్దీన్, నజీర్ అహ్మద్, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, కొప్పరపు రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

పట్టణంలో ఈ నెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 12వ తేదీ ఆత్మకూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల్‌లో జరిగే ఈజాబ్‌మేళాకు 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇం టర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని చెప్పారు. వివరాలకు 7673902328, 91548 30286 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలతో ఒత్తిడిని జయించొచ్చు

- అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు


హోంగార్డులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉద్యోగంలో ఒత్తిడిని జయించొచ్చని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అన్నారు. గురువారం హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారికి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పా ల్గొని మాట్లాడారు. నిత్యం పనిఒత్తిడితో ఉండడంతో అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. క్రీడల్లో పాల్గొని వీటిని దూరం చేసుకోవ చ్చన్నారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్స్, షార్ట్‌పుట్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈపోటీల అనంతరం శనివారం జరగబోయే రైసింగ్ డే కార్యక్రమంలో ఎస్పీ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథరెడ్డి, సురేశ్‌కుమార్, ఆర్ఎస్సైలు ఉమ మహేశ్వరరెడ్డి, పీరయ్య, మనోహర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ నేతలపై దాడులు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



హరినాథ్‌రెడ్డి పరామర్శిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే వైసీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ హరినాథ్‌రెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయనను నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో చిచ్చురేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైసీపీ నాయకులపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతూ ప్రజలను బయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

సామాజిక సేవలో ఫార్మసీ విద్యార్థులు

పాణ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొన్నారు. గురువారం నెరవాడ గ్రామంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్యం, విద్య, అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తుల సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి, కోఆర్డినేటర్ సుబ్బయ్య, అధ్యాపకులు మహేశ్వరరెడ్డి, అన్వర్ హుశేన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై చర్చిస్తాం


మహానందిలో అస్యూరెన్స్ కమిటీ సభ్యుల బృందం

మహానంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి చర్చిస్తామని అస్యూరెన్స్ కమిటీ సభ్యులు ఎంవి రామచంద్రారెడ్డి, కౌరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం మహానంది క్షేత్రంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పురాతన ఆలయాలు చాల ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయాలన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులతో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. వీరివెంట ఏఈవో మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, వీఆర్వో చలమయ్య పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నల్లమలలో వన్యప్రాణుల గణాంకాలు

పెద్దపులి పాదముద్రల సేకరణ


వన్యప్రాణుల గుర్తులను సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

రుద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలోని నల్లమలలో డిసెంబరు 1 నుంచి పులుల గణన ప్రక్రియ ప్రారంభించినట్లు గురువారం రేంజర్ ముర్తుజావలి తెలిపారు. ఫేజ్-1లో ఎనిమిది రోజుల పాటు మొదటి మూడు రోజులు ప్రతి బీట్‌లో ఐదు కి.మీ చొప్పున మొత్తం 15 కిమీ 14 బీట్‌లలో 210 కిమీ సిబ్బంది కాలిబాటన నడుస్తూ మాంసాహార జంతువులు పెద్దపులి, చిరుత, ఎలుగుబంటి, రేసు కుక్క, అడవి పిల్లి వంటి వాటిని గుర్తించారన్నారు. పాదముద్రలు, పెంటికలు, చెట్లకు గీరిన గుర్తులు గుర్తించారన్నారు. దీంట్లో పెద్దపులి పాద ముద్రలు గుర్తించామన్నారు. శాఖాహార జంతువులను గుర్తించేందుకు ప్రతి బీట్‌లో ఉదయాన్నే 2 కిమీ చొప్పున ఒకే దిశన కాలిబాటన నడుస్తూ దుప్పి, అడవి పంది, కొండ గొర్రె, కణితి వంటి జంతువుల పెంటికలు అటవీ సిబ్బంది నమోదు చేస్తారన్నారు. అటవీ ప్రాంతంలో సహజ ఆవాసం అంచనా వేసేందుకు వృక్ష సంపద, గడ్డిరకాల జాతులను. ఔషధ మొక్కలను గుర్తిస్తామన్నారు. మొదటి మూడురోజులపాటు ట్రైల్ పాత్, చివరి రెండురోజుల పాటు ట్రాన్‌సెక్ లైన్ నిర్వహిస్తామని రేంజర్ తెలిపారు.

ఘనంగా ఘంటసాల జయంతి


నివాళి అర్పిస్తున్న లలిత కళా సమితి సభ్యులు

ఆళ్లగడ్డ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక టీబీ రోడ్డులో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి హాజరై ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లలిత కళా సమితి వ్యవస్థాపకుడు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి అతిథులను, ఘంటసాల అభిమానులకు కండువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పుల్లయ్య, అభిమానులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, మౌలాలి, సంజీవరెడ్డి, నారాయణ ఆచారి, కృష్ణయ్య, నారపురెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన


షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముస్లిం, మైనార్టీల వివాహాల కోసం నిర్మిస్తున్న షాదీఖానా నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. త్వరితగతిన షాదీఖానా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం


సుందరంగా అలంకరించిన ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్ష్మీవేంకటేశ్వర స్వామికి అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు.

చౌడేశ్వరీమాతకు పూజలు

బనగానపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో గురువారం అమ్మవారికి పల్లకీ సేవ, తదితర పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఊయలసేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పీవీ నాగార్జునరెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మన్ పీవీ.కుమారరెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహా చండీ హోమం

ప్యాపిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అంకాల పరమేశ్వరీదేవి ఆలయంలో గురువారం మహాచండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వేద పురోహితులు, భవాని మాలదీక్షాధారులు, భక్తులు పాల్గొన్నారు.

6న మంత్రి బీసీ రాక

సంజామల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అల్వకొండ క్రాస్ రోడ్డు వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 6న ముక్కమళ్ల గ్రామంలో జరిగే ఒంగోలు జాతి రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలను ప్రారంభించేందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు ముక్కమళ్ల టీడీపీ నాయకులు మూసాని చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎద్దుల పోటీలను ప్రారంభించి మొదటి బహుమతి రూ. 60,000 వేలు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. న్యూ క్యాటగిరీ విభాగంతోపాటు 6పండ్లలోపు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను వారు విడుదల చేశారు.

వైసీపీ విష ప్రచారాలు మానుకోవాలి

ప్యాపిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై వైసీపీ నేతలు విష ప్రచారాలు మానుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ హితవు పలికారు. గురువారం మండలంలోని రాచెర్ల గ్రామంలో ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నారన్నారు. అనంతరం ఆయన గ్రామంలో కొత్తగా నిర్మించిన కంబగిరిస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, కృష్ణరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

చాగలమర్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథ మందిరంలో గురువారం వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో దత్త జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగడహారతి, పంచామృతాభిషేకం, దత్త, అనగాదేవి వ్రతాన్ని మహిళలచే సామూహికంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటంతో పల్లకి ఉత్సవం చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జనార్ధన్, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, మహిళలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు తరలివచ్చి స్వామివారి పూజలు చేశారు. సాంబశివాలయం ప్రధాన అర్చకులు కల్లె శేషావలి శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు చేశారు. నిర్వాహకులు సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామయ్య, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: స్థానిక ఎస్సార్బీసీ కాలనీలో దత్త జయంతి వేడుకలు ఆలయ చైర్మన్ శ్రీరామ వెంకటసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.


బేతంచెర్లలో షిరిడీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కొలిమిగుండ్ల: పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొని షిరిడీ సాయిబాబాబకు పూజలు నిర్వహించారు. స్వామివారికి కాగడ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగంటిపల్లె రహదారిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలోను, ఎర్రగుడి, కైప సాయిబాబా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయిల్ శ్రీనివాసులు, గాధంశెట్టి వేణుగోపాల్, టంగుటూరు శ్రీనయ్య, గుండా రవికుమార్, సాయిరాం, జంగంశెట్టి, గోపాల్, సుబ్రహ్మణ్యం, నూకల విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు ఓంకార ప్రణవం, మందిర సంకీర్తన, 6 గంటలకు కాకడహారతి, సుప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు గురు చరిత్రపారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ధూప హారతి, 6.30కు బాబా వారి పల్లకీ సేవ నిర్వహించారు. గుండా గోపాల్, బాబు రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం గురువారం రాత్రి భక్తులతో కిటకిటలాడింది. దత్త జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు.


చాగలమర్రి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు


డోన్: పూజల్లో పాల్గొన్న భక్తులు

సాయి సన్మార్గంలో నడుద్దాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి


సాయిబాబాను దర్శించుకుంటున్న మంత్రి బీసీ

డోన్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): షిరిడీసాయి బాబా చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. దత్త జయంతి సందర్భంగా జాతీయ రహదారి పక్కన వెలసిన షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మంత్రిని ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ ఆలయంలో సాయిబాబాకు పూజలు చేసి హారతులిచ్చారు. ఆలయం సమీపంలో రూ.కోటి నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, సీఎం శ్రీనివాసులు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజా వైద్యశాల మల్లికార్జున, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ నారాయణ, కాంట్రాక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, వెంకటనారాయణ, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఆలేబాదు పరమేష్, కందుకూరు పార్థసారధి పాల్గొన్నారు

వైభవంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో గురువారం కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, కడప జిల్లాలతో పాటు వివిధ పట్టణాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సీఐ హనుమంత నాయక్ కోవెలకుంట్ల నుంచి నంద్యాలకు వెళ్లే రహదారిలో జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనాలు ఈ రహదారి గుండా మళ్లించి ఆళ్లగడ్డ మీదుగా వెళ్లేలా చేశారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత కాశిరెడ్డినాయన జ్యోతిని వెలిగించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ హనుమంత నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు భూపాలుడు, మల్లికార్జున్ రెడ్డి, రమణయ్య, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో రుద్రవరం సమీపంలోని గుట్టకొండ, చిన్నకంబలూరు మెట్ట, మందలూరులో, ముత్తలూరు మెట్ట వద్ద అవధూత కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. గుట్టకొండలో పుట్టమన్ను తెచ్చి భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. లక్ష్మీగణపతి, సుదర్శన, నవగ్రహ హోమాలు నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కొలిమిగుండ్ల: స్థానిక కాశిరెడ్డినాయన ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు గురువారం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైవీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి


మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

శిరివెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యూటీఎఫ్ మండల నాయకుడు శ్రీనివాస రెడ్డి అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లను యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు.

బాలికల గురుకుల కళాశాల

ప్రిన్సిపాల్‌గా సంగీత కుమారి

డోన్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజోతి): డోన్ బాలికల గురుకుల కళా శాల ప్రిన్సిపాల్‌గా సంగీత కుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా మార్పల మండలం నుంచి పదోన్నతిపై వచ్చి ఆమె ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. బంజార సంఘం రాష్ట్ర నాయకులు ఎస్కే సుబ్రహ్మణ్యం నాయక్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

కుష్టు లక్షణాలపై అవగాహన కల్పించాలి

ప్యాపిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుష్టు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కుష్టు వ్యాధి నిపుణురాలు తేజస్విని అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించాలని సూచించారు. శరీరంపై గోధుమరంగు మచ్చలు ఏర్పడటం, స్పర్శ లేకపోవడం వంటి లక్షణాలు కనబడితే కుష్టు వ్యాధిగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాహుల్, రామచంద్రారెడ్డి, రాఘవేంద్రగౌడు, సుమతిదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సుపై అవగాహన పెంచుకోవాలి

బనగానపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పతి డిగ్రీ విద్యార్థి సర్టిఫికెట్ కోర్సుపై అవగాహన పెంచుకోవాలని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ గౌస్, అధ్యాపకురాలు వసుంధరాదేవి మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అధ్యాపకులు, పీడీ పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

ప్యాపిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీయూ సంఘం కార్యాలయంలో గురువారం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా బీవై మద్దిలేటి, ఆర్థిక కార్యదర్శిగా విజయ్‌కుమార్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు వెంకట్‌నాయక్ సమక్షంలో జరిగాయి.

పార్కుల అభివృద్ధికి కృషి: చైర్మన్

డోన్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గురువారం పట్టణంలోని కేవీఎస్ పార్కును మున్సిపల్ కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. పార్కుల నిర్వహణలో వాకర్స్ కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

టీడీపీతోనే వాల్మీకులకు న్యాయం

డోన్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, ప్యాపిలి మాజీ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసులు, మిద్దెపల్లె గోవిందు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీ బైరెడ్డి శబరి బుధవారం పార్లమెంటులో ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బైరెడ్డి శబరికి వాల్మీకుల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపాల్ నాయుడు, సుధాకర్, శ్రీను, రామ్మోహన్‌నాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా సేవలో రోటరీ క్లబ్ ముందంజ

బేతంచెర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉంటుందని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రవీంద్ర అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బేతంచెర్ల రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా అశ్వర్థ నారాయణ, రాజేష్‌లు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సత్తార్ హాజీ, వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా గోపాల్, గౌరీ హుస్సేన్ రెడ్డి, మద్దిలేటి స్వామి, విజయ నాగరాజు, మాణిక్యం శెట్టి, సయ్యద్ అహ్మద్, నగర పంచాయతీ మేనేజర్ సువర్ణ లక్ష్మీ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. గురువారం చాగలమర్రి రైతు సేవా కేంద్రం వద్ద రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల గురించి రైతులకు వివరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, ఏఈవో మంజుల, వీఏఏలు దివ్య, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఎత్తుకు తగిన బరువు ఉండాలి

శిరివెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఎత్తుకు తగిన బరువు ఉండాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్ సూచించారు. సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోవిందపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

దొర్నిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని నంద్యాల జిల్లా డీడీఏ చెన్నయ్య రైతులకు సూచించారు. గురువారం ఏఈవో ప్రమీల ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడీఏ చెన్నయ్య, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వెంకటేశ్వర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. రైతులకు సాగులో మేలైన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేం ద్రం సిబ్బంది మహేష్, రైతులు పాల్గొన్నారు.

హరివరంలో రామాయణ సప్తాహం

ఉయ్యాలవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామంలో వారంరోజుల పాటు రామాయణ సప్తాహం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకు ఉంటుందన్నారు. పుట్టపర్తి చాగంటి జ్ఞాన సరస్వతి బిరుదాంకితులు వెంపుల అన్నాజీరావు గారి ప్రసంగం ఉంటుందన్నారు.

14న హిందూ సమ్మేళనం

కొలిమిగుండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో ఈనెల 14న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు దాసరి శ్రీనివాసులు, రాముడునాయక్ తెలిపారు. గురువారం స్థానిక సాయిబాబా ఆలయంలో వారు సమీక్షా సమావేశం నిర్వహించి, హిందూ సమ్మేళనం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి

సమావేశానికి హాజరు కానున్న మంత్రి బీసీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి

అవుకు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా శుక్రవారం పాఠశాలల్లో నిర్వహిస్తున్న మెగా పీటీఎం 3.0 విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి గురువారం పిలుపునిచ్చారు. అవుకు జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నారు. అందులో భాగంగా నంద్యాల డీఈవో జనార్ధన్‌రెడ్డి, ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డితో కలసి ఉగ్రసేనారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనే విధంగా పర్యవేక్షణ కోసం మండల స్థాయి అధికారులను నియమించారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరి, సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న మెగా పీటీఎం సమావేశాన్ని విజయవంతం చేయాలని సర్వశిక్షాఅభియాన్ ఏపీసీ నిత్యానందరాజు కోరారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. 5న జరిగే మెగా పీటీఎంకు కలెక్టర్‌కు రాజకుమారి హాజరవుతుండటంతో పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీవో సువర్చల, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్‌ఎంలు జీవయ్య, శాస్త్రీ, పీడీలు ఆశాజ్యోతి, శ్రీనాథ్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్‌పై ఉత్కంఠ

చాగలమర్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి డెయిరీ సొసైటీకి ఖాళీ ఏర్పడ్డ రెండు డైరెక్టర్ల స్థానానికి గురువారం నామినేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. ఎన్నికల అధికారి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాకపోవడంతో నామినేషన్ నిర్వహించలేదు. వాయిదా వేశారా? లేక ఏకగ్రీవంగా నిర్వహిస్తారా? అన్న ఉత్కంఠ నెలకొంది. నామి నేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, జయప్ప పోలీసు సిబ్బం దితో బందోబస్తు నిర్వహించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొలిమిగుండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ ఎంపీడీవో చంద్ర మౌళీశ్వర గౌడ్, ఏవో ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాల ప్రారంభోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారు లు, కూటమి నాయకులు వీక్షించారు. ఎంఈవో అబ్దుల్ కలాం, కొలిమిగుండ్ల సొసైటీ చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి, టీడీపీ నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, నాగార్జునరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో

అవుకు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం అవుకు జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఏపీ మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ శుక్రవారం జరుగనున్న మెగా పీటీ ఎం 3.0 కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో విజయ వంతంగా నిర్వహించాల న్నారు. ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యా నందరాజు అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీచేసి, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట జీసీడీవో సువర్చల, ఎస్వో స్వప్న ఉన్నారు.

నేడు గని గ్రామంలో సైరా నరసింహారెడ్డి నాటకం

గడివేముల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గడివేముల మండలంలోని గని గ్రామంలో అవధూత కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శుక్రవారం కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సై.సైరా నరసింహారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం ప్రదర్శన ఉంటుందని అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య వెల్లడించారు. టీజీవీ కళాక్షేత్రం, బుడ్డా వెంగళరెడ్డి కళావేదిక సంయుక్తంగా సమర్పిస్తున్న ఈ నాటక ప్రదర్శన రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. నాటక అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నాటకాన్ని తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పల్లేటి కులశేఖర్ రచించిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారని కార్యక్రమ కన్వీనర్ కె.వి.రమణ తెలిపారు.